## క్లుప్తంగా

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**భీమవరం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) నిరంతరం ఉద్యోగుల డిమాండ్ల సాధనకోసం రాజీలేని పోరాటం చేస్తోందని, దీనిలో భాగంగా ఈనెల 5వ తేదీన ×రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై మోహనరావు, జి జక్కరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధనకు రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు భీమవరం పెన్షనర్స్ భవనం కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి భూపతి రాజు రవీంద్రరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ పెన్షనర్లు అంతా పాల్గొనాలని మోహనరావు, జక్కరయ్య కోరారు.

### పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్, దుస్తుల బహూకరణ



గొల్లలకోడేరు హైస్కూల్లో స్పోర్ట్స్ కిట్స్ దుస్తులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

**పాలకోడేరు:** గొల్లలకోడేరు ఉన్నత పాఠశాలలో 1986–91 సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు తమ వంతు సహాయంగా విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్, డ్రెస్సులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంతెన రవి వర్మకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ శంకర్, పూర్వ విద్యార్థులు ఎం.విజయ ప్రసాద్, పెరుమాళ్ళ శ్రీనివాస్, ఇసుకపల్లి కృష్ణంరాజు, రేవులగడ్డ సుబ్బారావు, టేకు శ్రీను, కొల్లి పద్మావతి, శ్యామ సుందరి, కాంతరత్నం, దావీదు, సంపత్ రావు, కొల్లి సత్యనారాయణ, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవేకు త్వరలో డీపీఆర్

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

**భీమవరం:** భీమవరం – తాడేపల్లిగూడెం కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవేకు త్వరలో డీపీఆర్ సిద్ధమవుతుందని కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ చెప్పారు. భీమవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ హైవే నల్లజర్లకు కూడా కనెక్టయ్యేవిధంగా తాను ఇచ్చిన ప్రతిపాదనకు నేషనల్ హైవే అధికారులు సానుకూలంగా స్పందించారని చెప్పారు. భీమవరం పట్టణంలోని కుముదవల్లి రోడ్డు, బైపాస్ రోడ్డు, కాస్మో క్లబ్ రోడ్డులో ఉన్న రైల్వే క్రాసింగ్‌ల వద్ద త్వరలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేస్తామని తెలిపారు. మధ్యలో నిలిచిపోయిన ఎన్‌హెచ్ 216 నరసాపురం బైపాస్ రోడ్డు పనులకు సంబంధించి కోర్టు కేసులను రెండు నెలల్లో పరిష్కరించి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

### కలెక్టరేట్‌లో బేబీ ఫీడింగ్ రూమ్ ఏర్పాటు

**భీమవరం (ప్రకాశంచౌక్):** జిల్లా కలెక్టరేట్ పైఅంతస్తులోని వీసీ సమావేశ మందిరం పక్కన సోమవారం బేబీ ఫీడింగ్ రూమ్(చంటి బిడ్డలకు తల్లులు పాలు ఇచ్చు గది)ని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

### ఎస్ఎఫ్ఐ భీమవరం పట్టణ కమిటీ ఎన్నిక

**భీమవరం:** భీమవరంలో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షుడు బి గణేష్ చెప్పారు. పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి సాయికృష్ణ, ఎస్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా ఎస్ శ్రావణి, ఎ సాయి, సహాయ కార్యదర్శులుగా బి సింధు, ఎన్ లోకేష్, సభ్యులుగా ఎం భాగ్యలక్ష్మి, సంతోష్, కె హేమంత్, కీర్తి, ఎం వైశాలి, పి ప్రశాంతి, ఎస్ నాగేంద్ర, వి యువతేజ ఎన్నికయ్యారన్నారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

**నరసాపురం:** నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సోమవారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి గన్నాబత్తుల వల్లభరావు, బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి వైఎస్ ఫణికర్, వి.నాగేంద్రరావు, జనరల్ కార్యదర్శి పదవికి వెన్నా సూర్యప్రకాశరావు, కోశాధికారి పదవికి పూరిళ్ల శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త సహాయ కార్యదర్శి పదవికి ఇద్దరు, కౌన్సిల్ సభ్యులకు నలుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు జోసఫ్ తెలిపారు.

# నత్తనడకన ఖరీఫ్ సాగు

- నారుమడుల దశలోనే వరి పొలాలు
- వెదజల్లే బెటర్ అంటున్న వ్యవసాయాధికారులు



ఖరీఫ్ కోసం వేసిన నారుమడి



సిద్ధాపురంలో వెదజల్లు పద్ధతిలో ఖరీఫ్ సాగు చేస్తున్న దృశ్యం

**ఆకివీడు:** ఖరీఫ్ సాగు నత్తనడకన సాగుతోంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం, పంటకాల్వల ద్వారా నీరు అందకపోవడంతో ముందస్తు ఖరీఫ్ సాగు కాస్తా వెనుకబడింది. గోదావరి వెస్టన్ డివిజన్‌లో శివారు నియోజకవర్గంగా ఉన్న ఉండి నియోజకవర్గంలో వ్యవసాయం సాగుకు వెనుక, ముంపునకు ముందు అన్న చందంగా ఉంది. వర్షాకాలంలో ముంపు, వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడుతుండడంతో ఇక్కడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది ఇప్పటివరకు సరైన వర్షాలు పడకపోవడంతో నాట్లు సైతం ఇంకా పూర్తి కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**రైతులకు అందని భరోసా**

పంట సాగుకు అందజేసే అన్నదాత సుఖీభవ పథకం సహాయం కూడా సకాలంలో అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి తోడు రబీ మాసూళ్లు పూర్తి అయిన వెంటనే ధాన్యం విక్రయించిన రైతులకు సైతం ప్రభుత్వం సకాలంలో సొమ్ము జమ చేయలేదు. ఈ పరిస్థితుల్లో రైతులు సొమ్ములు కోసం ఎదురు చూడటంతోనే కాలం గడిచిపోయింది. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పంట సాగుకు ముందే రైతు భరోసా సొమ్మును జమ చేసేవారు. ధాన్యం సొమ్ము కూడా సకాలంలో చెల్లించడంతో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ప్రస్తుతం రైతులు పెట్టుబడుల కోసం అప్పులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు వర్షాలు సైతం లేకపోవడంతో ఆగస్టు మొదటి వారం వచ్చినా నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 50 శాతం నాట్లు కూడా పూర్తి కాలేదు. ఈ నెలాఖరునాటికి గాని నాట్లు పూర్తి అయ్యే అవకాశం లేదంటున్నారు.

**వెదజల్లు పద్ధతే బెటర్**

ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో రైతులు వెదజల్లు పద్ధతిని పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో రైతులు అక్కడక్కడా వెదజల్లు పద్ధతిని పాటించి ఖరీఫ్ సాగును పూర్తి చేశారు.

# చంద్రబాబు పాలనలో మోసం గ్యారెంటీ

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకట్రాయుడు



ఎల్‌వీఎన్‌పురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చినమిల్లి వెంకట్రాయుడు

**భీమవరం అర్బన్:** చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన గ్యారెంటీగా ప్రజలను మోసం చేస్తున్నాడనే నమ్మకానికి రాష్ట్ర ప్రజలు వచ్చారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ జెడ్పీటీసీ చినమిల్లి వెంకట్రాయుడు అన్నారు. భీమవరం మండలంలోని ఎల్‌వీఎన్‌పురం, ఈలంపూడి, కొమరాడ గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ 2014 ఎన్నికలలో నెరవేరని మోసపూరిత 600 హామీలు ఇచ్చి అధికారం చేపట్టగానే చంద్రబాబు ఆ హామీలు నెరవేర్చకుండా మోసం చేశారని గుర్తు చేశారు. మళ్లీ 2024లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని పవన్, చంద్రబాబు ఇంటింటికి బాండ్లు పంపిణీ చేశారని అధికారం చేపట్టి ఏడాదిన్నరలోనే తల్లికి వందనం 100 మందికి తల్లులకు 80 మందికే పడ్డాయన్నారు. పెంచిన రూ.4 వేల పెన్షన్లు రాష్ట్రంలో సుమారు 58 లక్షలకు పైగా ఉంటే కోతలు విధించి 52 లక్షల మందికే ఇస్తున్నారన్నారు. గ్యాస్ సిలిండర్లు డబ్బులు ఎంతమందికి పడ్డాయో..లేదోనని మహిళలు తలలు పట్టుకుంటున్నారన్నారు. పేదలకు ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని రూ.4,500 కోట్లు బకాయిలు పెట్టి నిర్వీర్యం చేశారన్నారు. చంద్రబాబు మోస పూరిత పాలనపై ఇంటింటికి తిరిగి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు.

**ఇంటింటికీ వివరించాలి**

నరసాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే నవరత్నాలు అమలు చేశారన్నారు. కానీ చంద్రబాబు పాలనలో అరకొర పథకాలు అమలు చేస్తూ కూటమి నాయకులు మోసం చేస్తున్న విషయాన్ని ఇంటింటికి వివరించాలన్నారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పార్టీ గ్రామస్థాయి కమిటీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జల్లా కొండయ్య, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, సర్పంచ్‌లు కేతా నాగబాబు, ఎంపీటీసీ వీరవల్లి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ అల్లూరి రవికుమార్ రాజు, మాజీ సర్పంచ్ రాట్నాల సత్యనారాయణ, మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బేతాళ సంతోష్ తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**భీమవరం అర్బన్:** మండలంలోని పెదగరువులో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం శ్రీరామపురం, పెదగరువు 11 కేవీ ఫీడర్లపై ఆర్‌డీఎస్ఎస్ పనులు, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. పెదగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా, ఇండస్ట్రియల్ లైన్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### మంచినీటి సమస్య పరిష్కరించాలి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

**ఆకివీడు::** స్థానిక 14వ వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు, సీపీఎం నాయకులు సోమవారం ప్రజా పరిష్కార వేదిక వద్ద తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ వార్డులోని జవహర్‌పేట, ఇతర వీధుల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కుళాయిల ద్వారా సక్రమంగా నీరు అందడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎం నాయకులు డీ.రవితేజ, బీవీ.వర్మ, ఎస్.ఉదయకుమారి మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగా కొందరు చేసిన ఆదేశాల మేరకు నీటి సరఫరా నిలుపుదల చేశారని ఆరోపించారు. 14వ వార్డుకు సరఫరా చేసే నీటిని వేరే వార్డుకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీ.లావణ్య, యర్రా కృష్ణవేణి, ఎస్.సూరిబాబు, ఎస్కే. బాజీ బాధిత మహిళలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వంకా రవీంద్రనాథ్

**వీరవాసరం:** గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ, లయన్స్ పూర్వ కౌన్సిల్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావలన్నారు. సేవాసంఘాల్లో మహిళలు సైతం కీలక పాత్ర పోషించాలని తణుకు మునిసిపల్ మాజీ చైర్మన్, లయన్స్ డిస్ట్రిక్ట్ గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ వంక రాజకుమారి తెలుపగా, సభలోని ముగ్గురు మహిళా సభ్యులు సభ్యత్వానికి తీసుకోవడానికి ముందుకు వచ్చారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా పోలిశెట్టి సత్యనారాయణ, డి పుల్లారావు కార్యదర్శిగా, జి సత్యనారాయణ కోశాధికారిగా, మరో ఏడుగురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు సమక్షంలో, మల్టిపుల్ చైర్మన్ మేక శ్రీరామ్ సురేష్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌వీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## గృహిణికి న్యాయం చేయాలని నిరసన



గృహిణికి న్యాయం చేయాలంటూ నిరసన తెలియజేస్తున్న దృశ్యం

**భీమవరం (ప్రకాశం చౌక్):** గృహిణికి న్యాయం చేయాలని కోరుతూ దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద బాధితురాలు పెనుగొండ గ్రామానికి చెందిన పడాల మీనాక్షితో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ మునలయ్య, మీనాక్షిలకు వివాహమై 23 ఏళ్లు కాగా, గత 9 ఏళ్లుగా ముసలయ్య ఆమెను పట్టించుకోకుండా మానసికంగా వేధిస్తున్నారని, ప్రశ్నిస్తే చంపేస్తానని బెదిరిస్తున్నారని, దీనిపై పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించినట్లు చెప్పారు.

## డీఎన్నార్ లా విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



భీమవరం లా కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన దృశ్యం

**భీమవరం:** సమాజంలో పేదలకు న్యాయ సహాయం అందించడానికి నూతనంగా లా పట్టా పొందిన విద్యార్థులు కృషి చేయాలని భీమవరం డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అన్నారు. డీఎన్నార్ లా కళాశాలలో మూడేళ్ల లా డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ కె రఘురామ్ మాట్లాడుతూ ఈ ఏడాది 82 శాతం ఉత్తీర్ణత సాధించగా 14 మంది డిస్టింక్షన్, 163 మంది ప్రథమ శ్రేణి మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ పి రామకృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ వై అశోక్‌కుమార్, చెల్లబోయిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## కోపల్లెలో కేవీకే శాస్త్రవేత్తల పర్యటన



కోపల్లెలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

**కాళ్ల:** మండలంలోని కోపల్లె గ్రామంలో ఉండి కేవీకే శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. దీనిలో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు అందించిన నూతన వరి రకము ఏంటీయూ 1212 క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో నూతన వరి వంగడం రకం కాల పరిమితి 140 రోజులని, సీజనల్‌గా వచ్చే తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడి వస్తుందన్నారు. పంటకు కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని, వాటి వలన జింకు, ఐరన్ లోపాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. నత్రజని, పొటాష్‌లను మాత్రమే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎస్.మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, ప్రవీణ, ఏవో రమేష్ నాయుడు, వీఏఏ మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### అవమానించి విధుల నుంచి తొలగించారని ఫిర్యాదు

**భీమవరం:** ఆరోగ్య సమస్యలతో కార్యాలయ వాహనాన్ని నడపనన్నందుకు కులంపేరుతో దూషించి ఇబ్బందులకు గురిచేశారని కె.మధు ఫిర్యాదు చేశారని టూటౌన్ సీఐ జి. కాళీచరణ్ తెలిపారు. 2008లో భీమవరం ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా చేరి తర్వాత అటెండరుగా పనిచేశానని, 2022లో పాలకొల్లుకు బదిలీ చేసినట్టు చెప్పి తనను అవమానించి ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించారని మధు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం



ఆకివీడు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద గోడ పత్రికను విడుదల చేస్తున్న దృశ్యం



పాలకోడేరు: తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

**ఆకివీడు:** పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని, తల్లి పాల విశిష్టతను ప్రతి ఒక్కరూ సమాజానికి తెలియజేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారిణి విజయరత్నం పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంవద్ద సోమవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలింత బిడ్డకు క్రమం తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలన్నారు. సమాజానికి ఆరోగ్యవంతమైన బిడ్డను అందజేయగలిగిన సత్తా తల్లులకు ఒక్కరికే ఉందన్నారు. తల్లిపాలతో దృఢమైన ఆరోగ్యాన్ని పిల్లలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు, శేణవాణి, సీతారామయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రైల్వే స్టేషన్‌లో రూమ్ ఆవిష్కరణ**

బాలింత తల్లుల ప్రయాణ సమయంలో ఇబ్బంది పడకుండా బిడ్డకు పాలు ఇచ్చేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక గదిని సోమవారం సీడీపీఓ విజయరత్నం, స్టేషన్ సూపరింటెండెంట్ ఆవిష్కరించారు. దీనిని గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలన్నారు.

**తల్లి పాల వారోత్సవాలపై అవగాహన**

**పాలకోడేరు:** తల్లి పాల వారోత్సవాల అవగాహన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహించారు. సూపర్వైజర్లు పార్వతి, సూర్యకుమారి మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, అలాగే తల్లికి రొమ్ము కేన్సర్ రాకుండా ఉంటుందని అన్నారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. అనంతరం తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు విమల, రమణ, శాంతకుమారి, జ్యోతి, అనంతలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

## చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం (ప్రకాశంచౌక్):** ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి, చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను ఆయన సందర్శించారు. స్టాల్స్‌నందు ఏర్పాటు చేసిన ఉప్పాడ, పట్టు చీరలు, మంగళగిరి కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్, వివిధ రకాల చేనేత వస్త్రాల నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. చేనేత వస్త్రాలు ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటలకు పట్టణంలోని ప్రకాశం చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు చేనేత ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, స్టాల్ మేనేజర్ పి.అనిల్ కుమార్, ఆప్కో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

### 5 నుంచి రక్తదాన పక్షోత్సవాలు

**భీమవరం (ప్రకాశంచౌక్):** ఈనెల 5 నుంచి 18వ తేదీ వరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన ప్రచార పక్షోత్సవాలకు సంబంధించి గోడ పత్రికను కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కొరత కారణంగా ఏ ఒక్కరూ ప్రాణం పోకూడదనే ఉద్దేశంతో రక్తదానంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివరామ బద్రిరాజు, డీఆర్డిఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డ్వామ పీడీ డా.కెసీహెచ్ అప్పారావు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి జి.పిచ్చయ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డీఎంహెచ్వో డా.జి.గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

### గురుకులాల్లో నేరుగా ప్రవేశాలు

**నరసాపురం రూరల్:** నర్సాపురం మండలం ఎల్‌బీచర్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల కళాశాలల్లో 5, 10వ తరగతుల్లో విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులు కూడా నేరుగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీఓ ఉమాదేవి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా ఎల్బీచర్ల గురుకుల పాఠశాలకు వచ్చి ఖాళీగా ఉన్న సీట్లను రోస్టర్ ప్రకారం ప్రవేశం పొందవచ్చని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 99632 50626లో సంప్రదించాలని పేర్కొన్నారు.